

— తల్లావఝుల సుందరం

హనుమంతరావుకి చదువుకునే రోజుల్లో చదువు బొత్తిగా బుర్రకి ఎక్కలేదు. అలాగని డిగ్రీ చేపట్టకాపోలేదు. కాపీలే కొట్టేడో యూనివర్శిటీలో కాగితాలే మార్పించాడో అతనికితప్ప వరొకడికి తెలీదు. అతను డైరెక్టుగా యస్.ఐ అయిపోవడానికి వాళ్ళ పిత్రుదేవులు అడ్డమైన కాళ్ళు (ఆయన దృష్టిలో) పట్టుకొని ఉద్యోగం వేయించిన మాట చూచాయగా తెల్సు— టూటౌన్ స్టేషన్‌లో. అందరికీ వివరాలతోసహా తెల్సునని హనుమంతరావుకి తెలీదు.

అతనికి జీతపురాళ్లు కాకుండా పైడబ్బు సంపాదించాలన్న ఆలోచన ఉద్యోగం చేరిన కొత్తల్లో అన్పించలేదు. ఆ తర్వాత అడ్డుదార్లు చాలా వున్నాయి సంపాదించివానికి అని తెల్సినా కొంచెం జంకేడు గాంధీగారిమీద గౌరవంకొద్దీ. దానికొక్కారణం స్కూల్లో చదువుకునే రోజుల్లో 'గాంధీగారి సౌత్రాఫికా యాత్ర' అన్న పాఠం అతని చిన్నారి మనసులో బలంగా నాటుకు పోయింది.

"కేసులు పట్టుకోవడంలో జాతికుక్కలాటోడు" — అన్నది కానిస్టేబుల్సందరూ కలసి ఇచ్చిన ఓపెన్ స్టేట్‌మెంట్.

"కిందటి పోలున్న ఆడారి నంజికొడుకులాటోడు కాదు. బగమంతుడు నాటోడు. పావలాకీ, పది పైసలకి కక్కుర్తిపడ్డు" —అన్నది రిక్షా జనం ఏకగ్రీవంగా వొప్పుకున్నమాట.

తనకన్నా పెద్దాఫీసర్ల దగ్గర ఖరీదైన ఆల్సేషియన్ కుక్కలా వినయంగా వుంటాడు.

రామాయణంలో రాముడు, హనుమంతుడు కొట్టుకొన్న సందర్భాలు వున్నాయట. కాని డియస్పీగారు హనుమంతరావు కొట్టుకొన్న సందర్భాలు లేవు.

"నీ అంత పిగ్ హెడెడ్ ఫెలోని నా సర్వీసులో నేనెప్పుడూ చూళ్ళేదు"—అని ఆయన అన్న అన్నిసార్లు, వీపుమీద రెండు తగల్నిచ్చి ఏడుస్తుంటే నోట్లో చాక్లెట్ పెట్టంగానే నవ్వే పిల్లాడిలా, హనుమంతరావుకూడా అన్నిసార్లు నవ్వేవాడు.

గాంధీగారి మూడు కోతుల నీతులు అతనికెంతో నచ్చినా ఆ మూడింటిని పాటిస్తే తక్కువ డిపార్టుమెంటు మూసెయ్యొచ్చునన్న అభిప్రాయానికి రాక తప్పింది కాదు చేరిన కొత్తల్లోనే.

"మన డిపార్టుమెంటు నంజివాటిది ఎనకటి వృత్తి మానేసేనన్నా నమ్మరు.... సేసే నాన లాటోడ్ని కాదన్నా అస్సలు నమ్మరు - తమరుగోరు సదుంకున్నారు కాబట్టి డవిరెక్టుగా యస్.ఐ బాబు అయిపోనారు. నాను సర్వీసు మీద ఏట్టునెపోనాను అంసేత...."

అని జ్ఞానోదయం కల్గించి చేతిలో మొదటిసారి నోట్లు పెట్టినప్పుడు హెడ్ మాటల్లో నిజాన్ని కొట్టి పారెయ్యలేకపోయేరు. అందుకే మొహమాటం పడక తప్పలేదు.

గోడమీద అద్దం చాటునుంచి నవ్వుతున్న గాంధీగారు బ్రతికొచ్చి "తప్పు నాయనా!"—అని అంటున్నట్టు అనిపించింది రాత్రి కలలో.

"తప్పుచెయ్యడం మానవ నైజం. హరిశ్చంద్రుడికి యస్.ఐ. పోస్ట్ ఇచ్చినా ఆయనకీ తప్పవు లంచం పుచ్చుకోవడం, అబద్ధాలాడడం"—అని అనుభవం నేర్పింది హనుమంతరావుకి.

స్వతంత్రమైన అభిప్రాయాలమీద నమ్మకం కల్గినప్పటినుంచి గాంధీగారు మళ్ళీ ఎప్పుడూ కలల్లోకి రాలేదు.

పౌరోహితం చేసుకునేవాడు పోలీసు డిపార్టుమెంటులో చేరినట్టు ఆయన అతి సౌమ్యంగా కన్పిస్తారు.

ఆ రోజు....

నిశ్చలంగా వున్న చెరువులో రాయి వేసినట్టుగా ఆయన వదనంలో అసహ్యం చిరాకు అల్లుకొని పోయుండడం చూసి టూటౌన్ స్టేషన్‌లో అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయేరు.

అప్పుడే వచ్చిన సింహాచలం అప్పుడగడానికి వచ్చినట్లు కొంచెం ఇబ్బంది పడ్డాడు యస్. ఐ. గార్ని పలకరించడానికి. కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్న ఆయన్ని చూడగానే అతని బుర్ర పదునెక్కడం ప్రారంభించింది. తుమ్మల్లో పొద్దుగూకినట్లున్న ఆయన వదనానికి కారణం ఏమిటో అంతు చిక్కలేదు.

"మన నెత్తికి మరో దరిద్రం తగులుకుంది ఛీ.. ఛీ....అందరూ బడుద్దాయిలు దొరికేరు నా పాలిట...." హనుమంతరావుగారు గర్జించేరు.


ఆ కేకలకి సింహాచెలం గుండాగిపోయి రపీమని నేలకొరిగి పోలేదు. అజ్ఞానులు వేసే ప్రశ్నలకి సమాధానం దొరకని స్వాముల వారిలా ఇబ్బంది పడ్డాడు.

"అయ్యా! అసలేటి జరిగిందండి....తమరు అలా సిటపటలాడిపోతున్నారు. పెద్దదొరగారు గాని సెప్పకుండా సెకింగ్‌కి రాలేదుకదా!" అన్న భావం కళ్ళద్దాల్లో దాచి క్వశ్చనుమార్క్ మొహం పెట్టాడు సింహాచెలం.

"ఎవడో వెధవ నిన్న సాయంత్రం పదో నెంబరు బస్సులో చైర్మన్‌గారబ్బాయి పర్సు కొట్టేసేడట. అన్నీ ఛండాలపు కేసులు" కాలు కాలిన పిలి కుర్చీలో కూర్చుంటూ విషయం విపులీకరించింది.

విషయం వినంగానే సింహచెలం కుంచించుకు పోలేదు.

'ఓస్ ఈపాటిదానికే ఇంత గింజుకుంటే నువ్వేటికి పనికొత్తావ్" అని మనస్సులో అనుకోక తప్పలేదు సింహాచెలం. ఆయన అమాయకత్వం తల్చుకోగానే చిన్న చిర్నవ్వు




పెదాలమీద మెరిసింది.

"బాబూ! అందులో నెక్కెంతుందేటండి?" మెల్లగా సందేహం ఆయన ముందుంచేడు.

"ఏడొందలు ... అంత డబ్బు జేబులో పెట్టుకొని బస్సులో ఎవడెక్కమన్నాడు? ఆ మాత్రం జాగ్రత్త పడవద్దు. ఏదన్నా మనం అంటే ట్రాన్సుపర్లు! ఛీ. ఛీ." విసుగుతో బాధను రంగరించి సింహాచెలం ముందు ఒలకబోసేరు హనుమంతరావుగారు.

ఇద్దరూ దెబ్బతిన్న పిట్టల్లా కుర్చీల్లో పడి ఆలోచనల్లో మునిగిపోయేరు. రాజకుమారికి కలలో మాంత్రికుడు కన్పించినట్టు సింహాచెలం మస్తిష్కంలో ఓ ఆకారం రూపు దిద్దుకుంది. కన్పించినవాడు మాంత్రికుడు కాదు. అందుకే సింహాచెలం భయపడలేదు.

యోగిలా కొంతసేపు మౌనంలో కరిగి ఓ నిర్ణయానికొచ్చేడు.

"బాబూ! రెండు రోజులు టయం అడగండి.... అరి సొమ్ము పువ్వుల్లో పెట్టి అంపెదాము.... ఆ యిసయం నాను సెటిల్మెంటిత్తాగా! మరో ఆలోసెన సెయ్యాక ముందు పోను కొట్టండి...." అని బలవంతం చేసేడు సింహాచెలం.

విశ్వరూపం దాల్చిన కృష్ణుడిలా కన్పించేడు సింహాచెలం హనుమంతరావుగారికి ఆ క్షణంలో. సింహాచెలం గారపళ్ళ చాటునుండి బయటకొచ్చిన చిరునవ్వులోని అర్థం ఇట్టే పసిగట్టిన యస్. ఐ. గారు మహో ఆలోచనకు తావివ్వక గీతాబోధన తర్వాత అర్జునుడిలా వెంటనే ఫోన్ అందుకున్నారు.

పెచ్చులూడిపోయి మరకలుపడ్డ గోడలతో, వ్రేల్లాడుతున్న బూజుతోవున్న ఆ స్టేషన్ భూతగృహంలా వుంది. మట్టి కొట్టుకుపోయిన అద్దం చాటున గాంధీగారు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేనన్న ధీమా, దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చుకొన్న తర్వాత తను లేనన్న ఆనందం ఆయన బోసినవ్వులో కన్పిస్తోంది. పటం ముందున్న మూడు పింగాణీ కోతులమీద మట్టి వేలుడు మందం పేరుకుపోయి ఏ జంతువులో అర్థంకాకుండా వున్నాయి.

సర్వసంగ పరిత్యాగిలా వున్న సింహా

చెలం లేచిపోయిన మొదటి పెళ్ళాం గురించి ఆలోచించడం లేదు. ఎన్ని అర్జీలు పెట్టినా రిపేరుకాని స్టేషన్ గురించి అంతకన్నా ఆలోచించటం లేదు.

తన ముందు నిర్లక్ష్యంగా నిల్చొనున్న 'జోకరు' గురించి ఆలోచిస్తున్నాడు.

జోకరు తొడుక్కొన్న బనీనుమీద గుండె లున్న గుడ్డల్లేని ఆడది కన్పిస్తూ నవ్వుతోంది. జేబులు కొట్టడానికిచ్చిన లైసెన్సులా మెళ్ళో తాయిత్తు బిగుసుకుపోయింది. ఏ చేతిలో బ్లేడు వున్నా సునాయాసంగా జేబులు కత్తిరించే నేర్పు అతనికి కలదు—అని ఆ స్టేషన్‌లో అందరికీ తెలుసు. అందుకే అతనంటే వాళ్ళకి గౌరవం. వృత్తిమీద గౌరవం, నిజాయితీవున్న మనిషి. అతని చూపుల తీక్షణత కొత్త బ్లేడంత పదునుగా వుంటాయి.

"యెదవ పన్లు సెసేటప్పుడైనా కూసింత యెనక ముందు సూసుకోవాల"—తత్వం చెప్పే మూడ్‌లోకి పోయేడు సింహాచెలం.

"ఏపైపోనాదండి మా సెడ్డ ఇబ్బందడి పోతున్నారు"-బీడీ వెలిగిస్తూ అతి నిర్లక్ష్యంగా అన్నాడు జోకరు.

"ఇంతకన్నా ఏటవ్వాలి? నాకు తెలీకడుగు తాను!!"—సూటిగా వాడి నిర్లక్ష్యాన్ని ప్రశ్నించేడు సింహాచెలం.

"ముందు ఇసయం తేల్చండి...."

"మొన్న మాపిటేల ఎల్లమ్మతోట జంక్షన్ కాడ డూటీ నీదేనా?"—క్రిమినల్ లాయర్లా అడిగేడు.

"అవును....అయితే ఏటండీ....?"—అని జోకరు అనలేదు. అవున్నన్నట్లు తలాడించేడు.

"పాపం యస్. ఐ. బాబు ధర్మరాజు నాటోడు....ఎంత సేతులో ఎట్టినా ఎదురుపెళ్ళ మెయ్యకుండా జేబీలో ఏట్టేసుకుంటాడు. అలాటి బగవంతుడికే ఎసరెట్టడం నేయంకాదు" గుండెల్లో గూడుకట్టుకొన్న బాధను వెళ్ళ గక్కేడు.

"మీగ్గాని మతోతోందేటండి .... నానేటి సేసేను....మామూలు నెక్క పెకారం తమరి సేతుల్లో వచ్చిందాంట్లో సగం ఎడ్తున్నాగా?"—చిరాగ్గా అన్నాడు జోకరు.

అర్జెంటుగా సింహాచెలంకి వొళ్ళు మండిపోయింది.

"నీయమ్మ .... ఇన్నాళ్ళూ నీ మాటలు నమ్మేను... నీ ఇసయం నిన్న తెలిసిపోనాది"-కోపం కొంచెం కొంచెం దిగమింగుకుంటూ అన్నాడు.

"బాబో....పొద్దుటేల పరాసికాలేటండి.... ఏటైందో సెప్పరేటండి...." ఎంతకీ విషయం తేల్చని హెడ్‌మీద చిరాకుపడ్డాడు.

"ఎదోస్ .... మానావు తొందరపడిపోతున్నావ్....కొబ్బరితోటకాడ కెళ్ళడానికి సానా టయాముందినేరా: సెప్పేది ఇను. మొన్న మాపిటేల ఎల్లమ్మ తోట జంక్సన్‌కాడ పదో నెంబరు బస్సులో ఓ పెద్దమనిసి కొడుకు పర్సు కొట్టీనావ్....అందులో...." అర్ధంతరంగా ఆగిపోయేడు యస్.ఐ. గారు చెప్పిన అంకె గుర్తుకురాక.

జోకరుకూడా కొట్టేసిన జేబు గురించి గుర్తు తెచ్చుకోవడంలో నిమగ్నమైపోయేడు.

"....అందులో తొమ్మిదొందలు సెక్కుండి...." తాపీగా గుర్తుతెచ్చుకొన్నాడు.

"అన్నేయం బాబూ....అందులో వున్నది నలభై చిల్లర....ఓ ఆడకూతురి పొటో.... రెండు సిత్తు కాయితాలు....అందులో సగం తవరిసేతిలో ఎట్నాదా? బావూ....గుర్తు తెచ్చుకొండి బావూ...." తన నిజాయితీని శంకించిన హెడ్‌మీద కోపం పెల్లుబికిపోయినా మాటల్లో మాత్రం వినయం వుట్టిపడింది.

అరిగిపోయిన డబ్బును గుర్తుచేసిన జోకరుకేసి అదోలా చూసేడు. ఆ చూపులో అసహ్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. దొరికిన దొంగలా మొహం పెట్టలేదు సింహాచెలం.

తన దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి వృత్తి సాగిస్తున్న జోకర్ని బ్రతిమాలాడాల్సిన అవసరం లేకపోయినా "వసుదేవుడంతటి వాడు...."—అన్న విషయం గుర్తుకొచ్చి—

"తక్షణం నువ్వో పనిసెయ్యాల....నేకపోతే మా ఆడదాని పసుపుకుంకాలు సొయానా నీ సేతుల్తో తుడిసేసిన పాపం నీకు సుట్టుకుం

టుంది. అంనేత .నువ్వు వర్జంటుగా తొమ్మి దొందలు నా నేతుల్లోకి రావాల . వర్దం అవు తోందా?!" — వసుదేవుడంత పనిమాత్రం చెయ్యలేదు సింహచెలం.

ఆరిన బీడిని వెలిగిద్దామనుకొన్న జోకరు పొరపాటున వొంటికి నిప్పంటించుకొన్నంత గాభరాపడ్డాడు హెడ్ మాటలు విని. ఆకాశ వాణి పలుకుల్లా సింహచెలం మాటలు చెవిలో మారుమ్రోగేయి భయంకరంగా. క్షణం ఆగి పోయిన గుండె మళ్ళీ యథాతథంగా కొట్టుకో డానికి బొత్తిగా మొహమాట పడలేదు.

"బావూ నానెక్కడికెల్లి తేనండి ?'

అసలే నెలాకరు—మానేనా నెట్టి ఇబ్బందిగా వుందండి ఎవని జేబు ముట్టుకొన్నా సిల్లర సిత్తు కాయితాలు తప్ప మరేటి దొరకటం నేదండి.. బాబూ ఈ వొక్క పాలికి నన్నొగ్గే యండి"—ప్రాధేయపడ్డాడు.

"ఛస్ .కేటీ నా కొడకా నీ పనితనం నాకు తెల్దేట్రా .నువ్వు తల్సుకుంటే నేనే గలవ్ . ఈసారి పెత్యేకంగా మా పరుమరేదలు నీ నేతుల్లో పెడుతున్నాం ..మరేం మాటాడక బుద్దిగా రెండు రోజుల్లో నా నేతుల్లో నెక్కం డాల. నాను దాన్ని పువ్వుల్లో ఎట్టి బాబుగారి నేతుల్లో ఎట్టాల. అయన్ని చీరయల్‌గా జరిగి పోతాయి. మరి నువ్వేం మాట్టాడక. "— కుక్క తిప్పుకోలేదు హెడ్.

ఊపిరాడని జోకరు మారు మాట్టాడలేదు.

దొరికిన అవకాశం వదులుకోలేదు సింహ చెలం. సందిగ్ధావస్థలోవున్న జోకరు మాటలు కోసం వెదికే లోపలే అర్జంటుగా అక్కడ నుంచి జారుకొన్నాడు.

ఎదురుగా హెడ్ బాబు కనబడకపోయేసరికి జోకరుకి మతిపోయినంత పనైంది. చెయ్యి గిల్లి చూసుకొన్నాడు. సంతృప్తి కలిగింది తను కల కనటంలేదని. తన్ని ఇరకాటంలో పెట్టిన హెడ్డుని డిపార్టుమెంటుని కించిత్ కూడా మొహమాట పడకుండా దేశవాళీ బూతుల్తో తిట్టుకొన్నాడు.

మాయమైన శవంకోసం ఓర్పుగా వెళ్ళే విక్రమార్కుడిలా స్టేషన్ నుంచి బయటపడ్డాడు జోకరు.

# 3

"చెడు మాట్లాడకు — చెడు చూడకు— చెడు వినకు—అన్న గాంధీగారు ఎంత పొర పాటు చేసేరు. మరో కోతినికూడా కలిపి 'చెడు చెయ్యకు' అని చెప్పకపోవడం ఆయన తప్పు. ఆయన సిద్ధాంతాల్ని నమ్ముకున్న నాబోటి వాళ్ళకు నిజంగా శిక్ష" — అని కుర్చీలో కూర్చొన్న హనుమంతరావు మట్టిపట్టిన కోతుల కేసి, గాంధీగారికేసి చూస్తూ అనుకొన్నారు.

'నాలుగో కోతి'ని గురించి ఆ లోకంలో గాంధీగారు ఆలోచిస్తున్నారో లేదో తెలీదుగాని, "అరు సెప్పింది కోతులకిగాని మాక్కాదుగా!" అని మాత్రం ఆయన బ్రతికొచ్చి అడిగితే చెప్పడానికి సిద్దంగా వుంది ఈ దేశం.

గాంధీగారిమీదనుంచి ఆలోచనలు మళ్ళించి గత రాత్రి తన పక్కమీద నలిగిన మాణి క్యాన్ని, ఆమె అందంలో అందాన్ని గురించి నెమరు వేసుకొంటూ—చూపులు గోడమీద పాకుతున్న బల్లి మీదికి కేంద్రీకరించి వున్న సమయంలో ఆలోచనలని చెదరగొడ్తూ టెలి ఫోన్ మ్రోగింది.

గాభరాగా ఫోన్ అందుకొన్నాడు. ఫోనులో అరుపులకి చెమట్లు పట్టేయి. "ఉంటాను సార్!" అని వినయంగా అని కసిగా ఫోన్ పెట్టేసేడు.

"వచ్చినవాడు ఫల్గుణుడు" కాదు. హెడ్ సింహచెలం.

పిలవకుండానే కన్పించే సినిమా దేవుడిలా అక్కడ కొచ్చేడు. వచ్చిన ఉత్తర క్షణం దేవుడ్ని శపించే భక్తుడిలా వున్న యస్. ఐ. గార్ని చూసి నమస్కారబాణం వదిలేడు. కానీ అది తగలకుండా తప్పించుకొన్నారు హను మంతరావుగారు.

"ఏమయ్యా! ఆ ఛైర్మన్‌గారి అబ్బాయి సంగతేం తేల్చావ్?"

ఆయన రోజుకి పదిసార్లు ఫోన్‌చేసి చంపు తున్నాడు. సమాధానం చెప్పలేక ఛస్తున్నాను.

యివాళ తేల్చకపోతే అండమాన్లో ఆకులు తినాల్సొస్తుంది. పోయి ముందా సంగతి చూడు" కాట్లకుక్కలా గయ్యిమన్నాడు.

అరిచే కుక్కల్ని పట్టించుకోని ఏనుగులా సింహాచెలం గదిలోంచి కదిలాడు.

అండమాన్లో ఆకుల గురించి ఆలోచించే లోపలే గేటుదాటి స్వంత డబ్బుతో సన్మానం చేయించుకోవడానికి వస్తున్న ఛోటా సినిమా నటుడిలా ఆనందంగా వస్తున్న జోకర్ని చూడ గానే సింహాచెలం ఆనందం అవధులు దాటింది.

ఎదురెళ్ళి చిరునవ్వు నవ్వేడు సింహాచెలం.

జోకరు మర్యాదలు అందుకొని విలాసంగా బీడీ నోట్లో పెట్టి అగ్గిపెట్టె కోసం హెడ్డుబాబుకేసి చూసేడు. వినయంగా జోకరు చేతికో అగ్గిపెట్టె వుంచేడు సింహాచెలం.

"ఏరా, మాకుసీ మీదున్నావ్ ...ఇసయం ఏంటి సేసేవ్?" స్వంత బావమర్దిని పలకరించినట్లు అడిగేడు.

"బావూ . .తమరు సెప్పిన పని నానెప్పుడయినా సెయ్యలేదా? ఆఁ!" అన్నట్టు కనుబొమలు పైకెగరేసేడు.

అంతే!

కానిస్టేబుల్గా చేరిన కొత్తల్లో డి. యస్. పి. గా ప్రమోహన్ చేసినంత ఆనందం. నెలాఖరులో లైటులేని సైకిళ్ళు తనూహించినవాటి కన్నా ఎక్కువ దొరకటం— వెదకబోతున్న దొంగలు బేడీలతో తన ముందు కన్పించినంత సంతోషం ఒక్కసారి వుక్కిరి బిక్కిరి చేసింది.

పెరిగిన బీపీ మళ్ళీ తరగలేదు.

"హెడ్డుబాబూ! నానెంత కష్టపడిపోనానో తమకి తెల్దు. లక్కీసేన్సుగా ఇప్పడే దొరికి పోనాడు! మరిలాంటి కేసు మళ్ళీ నా నెత్తినెట్టకండి..." అఁటూ సింహాచెలం చేతిలో తొమ్మిది వందరూపాయల కాగితాల్ని బాధగా ఇచ్చేడు.

చేతిలో డబ్బును చూడంగానే మొహం చిరిగిపోయేంత పెద్దవయ్యాయి కళ్ళు. జోకరు సామర్ధ్యాన్ని మెచ్చుకోకుండా వుండలేక పోయేడు.

"ఈ వైజాగు ఇసాపట్నం హోల్ మొత్తంలో నీకులాంటి పదునైనోణ్ని నా నెప్పుడు సర్వీసులో సూడ్నేదురా!" భుజంతట్టి నవ్వుతూ లోపలికి తీసికెళ్ళేడు. తన దగ్గిర రెండొందల్ని తల్చుకోగానే మనసు ఎక్కడికో పరిగెట్టింది.

"బాబూ. మరి నా నెల్తానండి .. "అంటూ గుమ్మం దగ్గర ఆగేడు.

"ఓరే .. బాబ్బాబు . ఆ సేర్మిన్ బాబుగాని ట్టేసనుకి ఎలుపొస్తే గొడవైపోద్దిరా! కుసింత సేపు నాకప్లో కూకో. " భుజం పట్టుకుని బ్రతిమలాడేడు.

"సరేపో " అన్నట్టు ఠీవిగా సింహాచెలం వెనక నడిచేడు జోకరు.

ఎడారిలో నీళ్ళకోసం వెతుకుతున్నట్టు వస్తున్న సింహాచెలంని జోకర్ని చూడగానే దిగులుగా కూర్చొన్న యస్. ఐ. హనుమంత రావుగారి మొహం మీద కొత్త కళేదో అతుక్కుపోయింది.

"అయ్యా! డబ్బు దొరికిపోనాదండి. . కొట్టేసింది ఈడేనండి. తమరు బాబుగారికి పోను గుద్దండి ." అన్న సింహాచెలం మాటలు వినంగానే హనుమంతరావుగారు ఎగిరి గంతేద్దామనుకొన్నారు. పైన టోపు వున్నదని గుర్తు రాగానే ఆ ప్రయత్నం విరమించేరు. సింహాచెలం తెలివితేటల్ని మెచ్చుకోలేదు.

మనసు ప్రమోషన్ సంగతి గుర్తుచేస్తే కర్తవ్యం పోను చేయించింది. ఆదుర్దాగా నెంబరు తిప్పేరు.

జోకర్ని తీసుకొని సింహాచెలం మరో గదిలోకి వెళ్ళిపోయేడు.

"అయ్యా! నేనండి మీ హనుమంతరావు. డబ్బు దొరికిందండి. అబ్బే మీరెందుకండి... కానిస్టేబుల్ చేత పంపిస్తాను. అయ్యా! మీరు యస్పీగార్ని కలిస్తే ఆఁ ఆఁ అదేనండి . ఉంటాను బాబు ." బిగబెట్టుకొన్న వూపిరంతా ఒక్కసారి వదిలేడు! మనసు తేలిక

పడింది. టేబుల్ మీద నోట్లు న్యూస్ పేపరంత పెద్దవిగా కన్పించేయి. తన ఆనందాన్ని బయటకు రాకుండా కప్పిపెట్టి "సింహచెలం" అని మాత్రం వెంటనే పిల్చేడు.

అయన పిలుపు అరుపులా స్టేషనులో మారుమ్రోగింది. బయట వరండాలో కులాసాగా బీడీలు తాగుతున్న కానిస్టేబుల్స్ పులి గాండ్రించిందేమోనని భయపడి బీడీలు పారేశారు.

ఆయన కేకకి సింహచెలం బెదిరిపోలేదు. కళ్ళద్దాలు సర్దుకుంటూ జారిపోతున్న లాగును లాక్కుంటూ కీళ్ళవ్యాధితో బాధపడుతున్నట్టు విసుగ్గా వచ్చేడు.

"చూడు. ..నేను అర్జంటు పనిమీద బయటకు వెళ్తున్నాను. డబ్బు వెంటనే కానిస్టేబుల్ చేత ఛైర్మెన్ బాబుగారికి పంపించు మర్చిపోకుండా వెంటనే పంపు...." అంటూ ఆర్డరు వేసి అంతకన్నా వేగంగా బయటకు వెళ్ళిపోయేరు.

దూరమైపోయిన మోటారుసైకిల్ శబ్దం విని చిన్నగా నవ్వుకొన్నాడు సింహచెలం. మరోమారు తనకి దక్కిన రెండువందల్ని చూసుకొని సంతృప్తిపడ్డాడు. ఆ హుషారులో కానిస్టేబుల్ని కేకేసేడు.

కానీ ...

టేబుల్ మీద చుట్ట చుట్టుకొని వున్న పాముల్ని చూసినట్టు ఖంగారుపడ్డాడు. రక్త ప్రసారం శరీరంలో ఆగిపోయింది. ఫాను గాలికి పేపర్ వెయిట్ క్రింద రెప రెపలాడుతున్న రెండు వందరూపాయల నోట్లను చూడగానే మతిపోయింది. శిలలా బిగుసుకుపోయాడు.

కొన్ని క్షణాలకి శిలకి ప్రాణం వచ్చింది.

ఎదురుగా కన్పించిన కానిస్టేబుల్‌కి వివరాలు చెప్పి డబ్బు పంపించేసేడు.

"ఈడు మా కేటీ నాకొడుకు నాకే టోపీ ఎట్టినాడు ." అని అప్రయత్నంగా అతని పెదాలు వుచ్చరించేయి. తనకన్నా మూడొందలు యెక్కువ సర్దుకొన్న యస్.ఐ. బాబుని తల్చుకోగానే వంటిమీద తేళ్ళు,జెర్రులు ఒక్కసారి పాకినట్టయింది. చెప్పలేనంత ఈర్ష్య కలిగింది.

అసూయ మంటలు అతణ్ణి దహించివేస్తున్న సమయంలో యెదురుగా తెల్లగా ఆత్మలా కన్పించిందో శాల్తీ. ఏదో లోకంలో వున్న సింహచెలానికి కళ్ళముందు తెల్లని బట్టల్లో ముసలివ్యక్తిని చూసేసరికి తనెక్కడుంది అర్థమవడానికి నిమిషం పట్టింది.

"అయ్యా బాబూ... నా జేబు కొట్టేసేరండి కూతురు పెళ్ళికోసం అప్పుచేసేను. . వెయ్యి రూపాయలు బాబు..." అతని ఏడుపు హృదయ విదారకంగా వుంది.

కళ్ళల్లో సుడులు తిరిగి కన్నీళ్ళు టేబుల్ మీదవున్న అద్దంపై పడ్డాయి. గోడకు తగిలించి వున్న గాంధీగారు కన్నీటిబొట్టులో పడి వికృతంగా కన్పిస్తున్నారు.

సింహచెలం తాపీగా విని అంతకన్నా మరో రెండురెట్లు తాపీగా కేసు రాసుకోవడం మొదలు పెట్టేడు.

గాంధీగారి కళ్ళకి జరుగుతున్న ఘోరం కనబడకుండా బూజు అద్దం పడింది. బూజు తెర తీయాలనిపించలేదు ఎవ్వరికీ. కారణం ఆయన మనసు క్షోభచెందడం ఇష్టంలేక. □

మీరు చదివారా!

ప్రమోద
పిల్లల మాస పత్రిక

వెల : రూ. 1-25

సం. చందా
రూ. 15/-